క్లుప్తంగా

ఫ్యాకల్టీ నైపుణ్యంపై శిక్షణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ట్రాన్స్‌ఫర్మేటివ్ టెక్నాలజీస్ ఇన్ మేనిఫేక్చరింగ్ – ఎఫ్‌డీపీ ఆన్ ఇండస్ట్రీ 4.0 అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ అనే అంశంపై వారం రోజులు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జర్మనీ డ్రెస్‌డెన్ టెక్నిస్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ సునీల్‌కుమార్ శర్మ, యూఎస్‌ఏ కార్పెంటర్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ నుంచి మహదేవన్ రాధాకృష్ణ, వంతరామ్ అవినాష్, ఎన్ఐటీ అగర్తలా నుంచి డాక్టర్ నీరజ్ శర్మ, దసల్ట్ సిస్టమ్ బెంగళూరు నుంచి రవికిరణ్ పోతుకుచ్చి, పరిశోధన టెక్నాలజీ హైదరాబాద్ నుంచి డాక్టర్ సత్యన్నారాయణ తదితరులు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ అందజేస్తారని తెలిపారు. ఈ శిక్షణ తరగతులు అధ్యాపకులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

గోవిందపురం పంచాయతీలో డీఎల్‌పీవో విచారణ



విచారణ చేస్తున్న డీఎల్‌పీవో గోపిబాల

వజ్రపుకొత్తూరు: గోవిందపురం పంచాయతీలో టెక్కలి డీఎల్‌పీవో ఆర్.గోపిబాల మంగళవారం విచారణ చేపట్టారు. నిధుల దుర్వినియోగం జరిగినట్లు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన స్థానిక పంచాయతీ భవనంలో సర్పంచ్ పాలిన రమ్య, పంచాయతీ కార్యదర్శులు, ఫిర్యాదుదారుల సమక్షంలో విచారణ చేశారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్ నిధులు దుర్వినియోగమైనట్లు ఫిర్యాదు ఉన్నందున విచారణ చేపడుతున్నట్లు డీఎల్‌పీవో తెలిపారు. విచారణలో వజ్రపుకొత్తూరు ఈవోపీఆర్డీ డి.తిరుమలరావు ఉన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా జాన్



జాన్‌ను అభినందిస్తున్న సంఘ ప్రతినిధులు

సోంపేట: బారువ గ్రామానికి చెందిన పెయిత్ హోమ్ చర్చి పాస్టర్ ఎ.జాన్‌ను ఇచ్ఛాపురం నియోజకవర్గ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈవిషయాన్ని సంఘ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. మండలంలోని జేపీకొత్తూరు గ్రామంలోని చర్చిలో నియోజకవర్గం పరిధిలోని పాస్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు జాన్‌ను దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పాస్టరు డి.వి.డి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయగౌరి విజయానికి కృషి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కవిటి: యూటీఎఫ్ బలపరిచిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. మండల కార్యవర్గ సమావేశాన్ని మండల యూటీఎఫ్ అధ్యక్షులు ఆర్.జగదీష్ అధ్యక్షతన కవిటిలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి విజయ గౌరిని గెలిపించుకోవాలన్నారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.మురళీప్రకాష్, ప్రధాన కార్యదర్శి సీతమ్మనాయుడు, మనోజ్ మహారాణా పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం పాడుగుపాడు గ్రామ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలకు గురైన కరుకోల శ్రీనివాసరావు (55) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఈ విషయాన్ని కోటబొమ్మాళి పోలీసులు తెలిపారు. మృతుడు మండలంలోని బోరుమజ్జిపాలెంలో కూలిపనులు చేసుకుంటూ జీవిస్తుండేవాడు. మృతుడి భార్య కుమారి, కుమారుడు ధర్మారావు కూలి పనులు నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నేడు దివ్యాంగుల గుర్తింపు శిబిరం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం పరిధిలోని దివ్యాంగుల కోసం టెక్కలి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం దివ్యాంగుల సహాయ ఉపకరణాల డివిజన్ స్థాయి గుర్తింపు శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని దివ్యాంగుల సంఘం జిల్లా ప్రతినిధి రత్నాల శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాఠశాల సందర్శన

ఇచ్ఛాపురం: పాఠశాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి-1 కురమాన అప్పారావు అన్నారు. పురపాలకసంఘం పరిధి బెల్లుపడలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించి విద్యార్థుల వర్కుబుక్‌లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అవసరమైన సలహాలు సూచనలు ఇచ్చారు.

ఎదురు చూపులేనా?



- ఏడు నెలలైనా మంజూరు కాని కొత్త పింఛన్లు
- ఎదురు చూస్తున్న వృద్ధులు, వితంతువులు

సోంపేట:

చాలామంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసే సామాజిక పింఛన్లే ఆధారం. ఒకటో తేదీ కోసం వీరంతా ఆశగా ఎదురు చూస్తుంటారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లను మూడు వేల రూపాయలకు పెంచి వీరిని ఆదుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పింఛను నగదు రూ. మూడు వేలు నుంచి రూ. నాలుగు వేలుకు పెంచింది. అయితే కొత్తగా పింఛన్లు మంజూరు చేయలేదు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పూర్తి కావస్తున్నా కనీసం దరఖాస్తు చేసుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. దీంతో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

నవంబర్‌లో కొత్త జీవో..

కూటమి ప్రభుత్వం నవంబర్ నెలలో కొత్త జీవో తీసుకువచ్చింది. నవంబర్ నెలలో ఒకటి నుంచి 15వ తేదీలోగా పింఛన్ అందుకుంటున్న భర్త చనిపోతే, మరుసటి నెల నుంచి భార్యకు పింఛను అందజేయాలని జీవోలో పేర్కొంది. 15 నుంచి 31వ తేదీలోగా చనిపోతే నెల విడిచి మరో నెలలో పింఛన్ అందజేయాలని ఆదేశాల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో చాలామంది అర్హులు పింఛన్లకు దూరమయ్యారు. సోంపేట మండలంలో జనవరి నెలలో 12 మందికి మాత్రమే నూతన పింఛన్లు అందజేశారు.

60 ఏళ్లు దాటిన వారిదీ అదే పరిస్థితి..

60 ఏళ్లు దాటిన వారు కూడా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. ఒక్క సోంపేట మండలంలోనే 60 ఏళ్లు దాటిన వారు వెయ్యి మందికిపైగా ఉన్నారు. 2024 డిసెంబర్‌లో దరఖాస్తులు స్వీకరించి సంక్రాంతికి జన్మభూమి కార్యక్రమం నిర్వహించి నూతన పింఛన్లు అందజేస్తామని ప్రజా ప్రతినిధులు ప్రకటనలు చేశారు. దీంతో సంక్రాంతికి కొత్త పింఛన్లు అందుతాయని ఆశపడిన వారికి ఎదురు చూపులే మిగిలాయి.

50 ఏళ్లు వారికి ఎప్పుడో?

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రధాన హామీ వెనుకబడిన తరగతులకు చెంది.. 50 ఏళ్లు పూర్తయిన వారికి పింఛన్లు అందజేస్తామని హామీ ఇచ్చింది. దీంతో చాలామంది నిజమేనని నమ్మారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటినా దీని గురించి కనీసం ప్రస్తావన కూడా లేకపోవడంతో లబ్ధిదారులు సర్కార్ తీరును తప్పుబడుతున్నారు.

ఎదురు చూస్తున్నాను



కొత్త పింఛను కోసం ఎదురు చూస్తున్నాను. నా భర్త చనిపోయి సంవత్సరం కావస్తుంది. అయినా నాకు ఇంకా పింఛను అందలేదు. అధికారులు స్పందించి పింఛను అందజేసి ఆదుకోవాలి.

–కూనే దమయంతి, జింకిభద్ర, సోంపేట మండలం

పింఛన్ రావడం లేదు



నేడు 70 శాతం దివ్యాంగుడిని. అయినా పింఛను ఇవ్వడం లేదు. మా నాన్నకు గతంలో పింఛను వచ్చేది. ఆయన మృతి చెంది సంవత్సరం కావస్తుంది. మా అమ్మకు కూడా పింఛను మంజూరు కాలేదు. పింఛను ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు.

–తామాడ నీలకంఠం, జింకిభద్ర

హామీని అమలు చేయాలి



గత ప్రభుత్వ హయాంలో చేతివృత్తుల వారికి అందజేసే జగన్న చేదోడు పథకరం ద్వారా రూ. పదివేలు అందజేసేది. ప్రస్తుతం ఎటువంటి పథకాలు అందడం లేదు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో 50 ఏళ్లు దాటినవారికి పింఛను అందజేస్తామని హామీ ఇచ్చింది. దీన్ని తక్షణమే అమలు చేయాలి.

–సాహుకారి జాని, దర్జీ, జింకిభద్ర


ఆదేశాలు రావాలి



ప్రభుత్వం ప్రస్తుతం పింఛను అందుకుంటున్న భర్త చనిపోయిన భార్యలకు పింఛన్లు అందజేస్తున్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే అర్హులైన వారిని గుర్తిస్తాం. కొత్త పింఛన్ల కోసం ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి.

–ఈశ్వరమ్మ, ఎంపీడీవో, సోంపేట

ఇవ్వకపోవడం దారుణం



ప్రభుత్వం అర్హులైన వారందరికీ పింఛన్లు అందజేయాలి. ప్రస్తుతం నవంబర్ నుంచి కొందరికే పింఛన్లు అందజేయడం వలన గ్రామాల్లోని అర్హులైన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నిబంధనల మేరకు అర్హులందరికీ వెంటనే పింఛన్లు అందజేయాలి.

–డాక్టర్ నిమ్మన దాస్, ఎంపీపీ, సోంపేట

సాధ్యంకాని హామీలెందుకు ఇచ్చారు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



పేరాడ తిలక్

టెక్కలి: సూపర్ సిక్స్ పథకాలు అమలు సాధ్యం కాదని చంద్రబాబుకు ఇప్పుడు తెలిసిందా అని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ప్రశ్నించారు. సాధ్యం కాని హామీలతో రాష్ట్ర ప్రజల్ని మరోసారి ఘోరంగా మోసం చేశారని మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏ నాయకుడైనా ఎన్నికల ముందు రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు హామిలిచ్చి ఆ తరువాత వాటిని అమలు చేస్తారని.. అయితే చంద్రబాబు మాత్రం కేవలం ప్రజల్ని మోసం చేసి అధికారం దక్కించుకోవడానికే సూపర్ సిక్స్ అన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇప్పుడు గుర్తుకు వచ్చాయా అని నిలదీశారు. ఆర్థిక పరిస్థితుల పేరుతో హామీలు అమలు చేయలేమంటూ చంద్రబాబు దొంగదారి పట్టారన్నారు. కూటమి ప్రభుత్వం నెలల పాలనలోనే ప్రజలపై విద్యుత్ బిల్లులతో నిత్యావసర సరుకుల పెంపు భారం వేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో అధికారం దక్కించుకుని తద్వారా పెద్ద ఎత్తున అక్రమాలు చేయడానికే కూటమి ప్రభుత్వం సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజల్ని చారిత్రాత్మకంగా మోసం చేశారని గుర్తు చేశారు. ఇప్పటికే ఇసుక, మద్యం మాఫీయాలతో కోట్లాది రూపాయలు కొల్లగొట్టేశారని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఐదేళ్ల పాలనలో పూర్తిస్థాయి హామీలతో సంక్షేమ పథకాలు ఇచ్చి దేశంలో తిరుగులేని నాయకుడుగా ఎదిగారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రజలు కళ్లు తెరిచి కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పలాస: గుండె ఆగిపోయి ప్రాణాపాయస్థితిలో స్థితిలో ఉన్నవారికి సీపీఆర్ ద్వారా ప్రాణాలను నిలబెట్టవచ్చని ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి సత్యన్నారాయణ చెప్పారు. బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం శాఖ సీపీఆర్ ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండె ఆగిపోయినప్పుడు సీపీఆర్ చేయడం ద్వారా ఎలా ప్రాణాన్ని నిలబెట్టవచ్చో వివరించారు. ప్రమాద సమయంలో ఎముకులు విరిగినప్పుడు ట్రయాంగిల్ బాండేజ్ ద్వారా ఎలా కట్టాలో అవగాహన కల్పించారు. ముఖ్యంగా సీపీఆర్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎస్వీ రమణరావు, జూనియర్ రెడ్‌క్రాస్ నోడల్ అధికారి కొయ్యల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, సుధాకుమారి, పద్మలోచన, జనార్దనరావు, పద్మ, శివప్రసాద్, యామిని, కిషోర్, బి.చిన్నారావు, లక్ష్మీభాయి, తులసీరాణి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కంచిలి: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు ఇటీవల మృతి చెందారు. కొల్లూరు పంచాయతీ పరిధి సిర్తలి గ్రామానికి చెందిన పైల నూకయ్యరెడ్డి, కొల్లూరు గ్రామానికి చెందిన గోకర్ల దామోదర్, ఘాటీముకుందాపురం గ్రామానికి చెందిన తెలుకుల క్రిష్టారావు అనారోగ్యంతో మృతిచెందగా, గొల్లపుట్టుగ గ్రామానికి చెందిన మురపాల గోపాల్ గుండెనొప్పితో చికిత్స పొందుతున్నారు. వీరి కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు తదితరులు మంగళవారం పరామర్శించారు.

గీత కార్మికులకు రెండు మద్యం షాపులు కేటాయింపు

సోంపేట: సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వం గీత కార్మికులకు రెండు మద్యం షాపులు కేటాయించినట్లు సీఐ కె.బేబి మంగళవారం తెలిపారు. మందస మండలంలో శ్రీశయన సామాజిక వర్గానికి, కంచిలి మండలంలో సెగిడి సామాజిక వర్గానికి చెందిన వారికి షాపులు కేటాయించడం జరిగిందన్నారు. అర్హులైన వారు ధ్రువీకరణ పత్రాలతో ఫిబ్రవరి ఐదో తేదీలోగా దరఖాస్తులను తమ కార్యాలయానికి అందజేయాలన్నారు. ఫిబ్రవరి ఏడో తేదీన డ్రా తీసి షాపులు కేటాయిస్తామని.. అవకాశాన్ని గీత కార్మికులు వినియోగించుకోవాలని కోరారు.

వజ్రపుకొత్తూరు మండలంలో ఒకటి..

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు మండలానికి సంబంధించి గీత కార్మికులకు ఒక మద్యం దుకాణం కేటాయించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.మల్లికార్జునరావు తెలిపారు. శ్రీశైన ఉపకులస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

పథకాలు ఇవ్వలేని వారు హామీలు ఎందుకు ఇచ్చారు?

- వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ జీవితేశ్వరరావు



జీవితేశ్వరరావు

కాశీబుగ్గ: సంక్షేమ పథకాలు ఇవ్వలేమని చెబుతున్న చంద్రబాబు ఎన్నికలకు ముందు ఎందుకు హామీలు ఇచ్చారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచాక ఆర్థిక ఇబ్బందులంటూ సాకులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. కాశీబుగ్గ శ్రీక్రిష్ణ ఆస్పత్రిలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న చంద్రబాబుకు ఏ పథకాలు అమలు అవుతాయో.. ఏవి అమలు చేయలేమో తెలియదా అన్నారు. రాష్ట్ర ప్రజలు ఆయన్ని నమ్మి గెలిపించి వారంతా సపోర్టుగా నిలిస్తే ఎన్నికల విజయం అనంతరం ఇచ్చిన హామీలు నెరవేర్చలేమని.. అవి చెయ్యలేమని.. అందుకు ఆర్థిక పరిస్థితి బాగోలేదని డ్రామాలు మొదలు పెట్టారని అన్నారు. జనాలు వాస్తవాలను తెలుసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని మౌలిక సదుపాయాలు ఉన్న తిరుపతి, కర్నూల్, విశాఖపట్నం, విజయవాడ వంటి పెద్ద నగరాలు ఉండగా ఆగమేఘాలు మీద ప్రపంచ బ్యాంకు నిధులు తెప్పించి కొత్త నగరం నిర్మించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. పథకాలు అందించకుండా ప్రజలను మోసగించడం దుర్మార్గమన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఐదేళ్లు పరిపాలించినా తరతరాలు చెప్పుకునే పథకాలను అమలు చేశారన్నారు. ఇప్పటికైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేయాలన్నారు.

టోల్ సిబ్బందికి నేత్ర పరీక్షలు



రక్తదానం చేస్తున్న వాహనదారులు

కాశీబుగ్గ: జాతీయ రహదారి భద్రత ఉత్సవాలలో భాగంగా పలాస మండలం లక్ష్మీపురం టోల్ ప్లాజా ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, టోల్ సిబ్బందికి నేత్ర పరీక్షలు చేశారు. సుమారు వంద మందికి కంటి పరీక్షలు చేసి.. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ సెంథిల్‌కుమార్, వి.వి.కె.వి.ప్రసాద్, టోల్ ప్లాజా మేనేజర్ లనీష్ జాన్, టోల్ ఐఎంటీ సిబ్బంది పాల్గొన్నారు.

జీడితోటల సంరక్షణపై వగాహన

పలాస: ఉద్దానం ప్రాంతంలోని జీడితోటలకు తక్షణమే తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ సహాయకులు తెప్పల పావణి చెప్పారు. బొడ్డపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు పలు సలహాలు సూచనలు చేశారు. మాజీ సర్పంచ్ తామాడ త్రిలోచనరావు, దాసరి శ్రీరాములు, బొడ్డు సింహాద్రి, రాజాం గుణవంతు, కిక్కర డిల్లీరావు, కుమార్ రాజు, తామాడ నరేష్, బొడ్డు యుగంధర్, సార సాంబమూర్తి పాల్గొన్నారు.

విజ్ఞాన కేంద్రానికి మాజీ మంత్రి ఆర్థికసాయం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న అప్పలరాజు

కాశీబుగ్గ: సోంపేట మండలం మామిడిపల్లి గ్రామంలోని గానుగు తరుణాచారి విజ్ఞాన కేంద్రానికి రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆర్థిక సహాయం మంగళవారం అందించారు. సామాజిక చైతన్యాన్ని ప్రేరేపితం చేయడానికి నిర్దేశించుకున్న లక్ష్యసాధనలో విజ్ఞాన కేంద్రం ఒక సాధనంగా ఉపయోగపడుతోందని ఈ సందర్భంగా అప్పలరాజు అన్నారు. సంబంధిత ప్రతినిధులను అభినందిస్తూ పలాసలోని తన స్వగృహంలో సాయాన్ని అందజేశారు.

30న హిందూధార్మిక సభ

ఇచ్ఛాపురం: పురపాలకసంఘం పరిధి రత్తకన్న పాతాళసిద్ధేశ్వరాలయంలో ఈనెల 30వ తేదీన హిందూ ధార్మికసేవాసమితి ఆధ్వర్యంలో హిందూధార్మిక మహాసభలను నిర్వహిస్తున్నట్లు హిందూధార్మిక సేవాసమితి వ్యవస్థాపకులు బాలబ్రహ్మానంద సరస్వతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాతాళసిద్ధేశ్వరాలయం సమీపంలోని హిందూధార్మిక సేవాసమితి ఆశ్రమంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. దేశంలోని నలుమూలల నుంచి 16 మంది పీఠాధిపతులచే హిందూ ధార్మిక మహాసభలతో పాటు వారాహియాగం, మహాఅన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

సామూహిక పారాయణం



కవిటిలోని పట్టాభిరామాలయం, ప్రగడపుట్టుగ కోదండ రామాలయాల్లో మంగళవారం 16 రోజుల పండుగను కన్నుల పండువగా నిర్వహించారు. కవిటి పట్టాభిరామాలయంలో ప్రధానార్చకులు కందాళ పద్మనాభ యోగానందస్వామి ఆధ్వర్యంలో ద్రవిడ ప్రబంధం తిరుప్పావై పాశురాలను దీక్షలో పాల్గొన్న మహిళలు సామూహిక పారాయణం చేశారు. అనంతరం గోదాదేవి అష్టోత్తర శతనామస్తోత్రసహిత సామూహిక కుంకుమార్చనలు నిర్వహించగా.. మంగళ సూత్రాలను గోదాదేవికి అలంకరించే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– కవిటి

మార్కెట్‌లోకి 'రామఫలం'



రామఫలం పండ్లు సీజన్ ఆరంభమైంది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీరోడ్డులో వీటిని కొంతమంది విక్రయిస్తున్నారు. కొండ ప్రాంతాలలో మాత్రమేలభించే ఈ పండ్లకు మంచిగిరాకీ ఉంది. కేజీ 110 రూపాయలకు విక్రయిస్తున్నారు.

–కాశీబుగ్గ:

ఆలయ వార్షికోత్సవం



కంచిలి మండలం కొల్లూరు పంచాయతీ పరిధి సిర్తలి గ్రామంలోని మహాపోలమ్మ తల్లి ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, నాయకులు లడ్డు కేశవపాత్రో, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

–కంచిలి

ఉద్యమ నేతకు నివాళి



కార్మికుల సంక్షేమం కోసం వీజేకే మూర్తి చేసిన ఉద్యమాలు మరువలేనివని రైతు సంఘం ప్రతినిధులు అన్నారు. మూర్తి సంతాప సభను బారువ గ్రామంలో మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మిక ఉద్యమ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. రైతు సంఘాల నాయకులు పొందర భాస్కర బడిత్యా, కిర్ర వెంకటరావు, వనిమిన కృష్ణారావు, దున్నలోకనాథం ఉన్నారు.

–సోంపేట

క్రీడాకారునికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం రూరల్: తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుడు మజ్జి అజిత్‌కి ఈదుపురం జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు, మేనేజ్‌మెంట్ కమిటీ సిబ్బంది కలిసి రూ.15,500 ఆర్థికసాయం అందజేశారు. హెచ్‌ఎం బి.తమ్మయ్య అధ్యక్షతన క్రీడాకారునికి మంగళవారం అభినందన సభ నిర్వహించగా.. గ్రామసర్పంచ్ నర్తు ప్రసాద్ సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు రవికుమార్ మాట్లాడుతూ.. అజిత్ ఇదే పాఠశాలలో పదో తరగతి వరకు విద్యను అభ్యసించాడని తెలిపారు.

గుజరాత్‌లో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని 600 మీటర్ల పరుగు పందెంలో కాంస్యం, రాష్ట్రస్థాయి పోటీలో అండర్-18 విభాగంలో 800 మీటర్లు, ఆరు కిలోమీటర్ల పరుగులో స్వర్ణ పతకాలు సాధించినట్టు పేర్కొన్నారు. అలాగే ఈ ఏడాది జరగనున్న ఏషియన్ గేమ్స్ ఎన్నిక ప్రక్రియకు ఎన్నికైనట్టు చెప్పారు.

సంక్షిప్తంగా...

మంత్రి ఇలాకాలో ధాన్యం కొనుగోళ్లలో విఫలం



హేమసుందర్‌రాజు

టెక్కలి: వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సొంత మండలంలో ధాన్యం కొనుగోలు విషయంలో ఘోరంగా వైఫల్యం చెందారని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సంపతిరావు హేమసుందర్‌రాజు మండిపడ్డారు. మంగళవారం కోటబొమ్మాళిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టార్గెట్ల పేరుతో సుమారు 40 రోజులుగా మండలంలో ఎక్కడా ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. కళ్లాల్లో ధాన్యం నిల్వలతో రైతులు పడుతున్న ఇబ్బందులు మంత్రి అచ్చెన్నాయుడుకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ధాన్యం కొనుగోలు లేకపోవడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారీల భారిన పడుతున్నారన్నారు. సొంత మండలంలోనే రైతులు పరిస్థితి దయనీయంగా ఉంటే, అవేమీ పట్టనట్లుగా మంత్రి అచ్చెన్నాయుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని హేమసుందర్‌రాజు అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువుల పంపిణీలో సైతం వైఫల్యం చెందారని.. ఇప్పుడు ధాన్యం కొనుగోలులో అదే పరిస్థితి చోటు చేసుకుందన్నారు. ఆర్భాటంగా ప్రారంభించి అవసరమైనపుడు కొనుగోలు ప్రక్రియ ఆపివేశారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా మంత్రి తన సొంత మండలంలో రైతుల ఘోష పట్టించుకోవాలని డిమాండ్ చేశారు.

ముగిసిన టెన్నికాయిట్ శిక్షణ

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ క్రీడా మైదానంలో పది రోజులుగా జరిగిన టెన్నికాయిట్ జాతీయ శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా టెన్నికాయిట్ సంఘ అధ్యక్షులు మల్లా సంతోష్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు వితరణగా అందించారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పట్ట తవిటయ్య, సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.వి.జోగారావు, అథ్లెటిక్స్ సంఘ సాంకేతిక కమిటీ చైర్మన్ కె.హరిబాబు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు సీహెచ్ పద్మలోచనం, ఎస్.రామారావు, ఎస్.చంద్రశేఖర్, పి.గజేంద్ర, శిక్షకులు దామోదర్ పాల్గొన్నారు.

పాఠశాల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం

టెక్కలి: ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో డివిజన్ స్థాయి విద్యా శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ స్కూల్ వివిధ దశలు, బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ ప్రక్రియపై ఆరా తీశారు. త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో తొమ్మిది మండలాలకు చెందిన విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

ఆదిత్యలో పుస్తకావిష్కరణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నూతన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళాశాలకు చెందిన సీఎస్ఈ, సీఎస్‌డీ విభాగాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎస్.కళ్యాణ్, బండారు రమేష్ తదితరులు రచించిన డేటా కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్‌వర్క్స్ పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌వోడీలు వై.రమేష్, నరేష్ పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి ఆలయంలో అన్నదానం

టెక్కలి: కోటబొమ్మాళి మండల కేంద్రంలోని కొత్తమ్మతల్లి దేవస్థానంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి వి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో భక్తులతో పాటు గ్రామస్తులకు అన్నదానం చేశారు.

జగనన్న లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

టెక్కలి: టెక్కలి జగతిమెట్ట సమీపంలోని జగనన్న లేఅవుట్‌లో మంగళవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత కాలనీలో చోటు చేసుకున్న అక్రమాలపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. అయితే కాలనీపై విచారణ బాధ్యతలను విజిలెన్స్ అధికారులకు అప్పగించిన నేపథ్యంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు మరోమారు కాలనీలో దర్యాప్తు నిర్వహించారు. ఖాళీ స్థలాలు, ఆక్రమిత స్థలాల్లో బోర్డులను ఏర్పాటు చేశారు.

'టీడీపీ నాయకుడి ప్రచారంలో వాస్తవం లేదు'

కాశీబుగ్గ: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీలో బోర్డు మెంబర్ పదవి రద్దయిందని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ మందస మండల నాయకుడు భావన దుర్యోధన చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని వర్సిటీ బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. మందస మండలం బేతాళపురంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్ మేనేజ్‌మెంట్ నోటిఫికేషన్ ప్రకారం 2022 నవంబర్ 30వ తేదీన జీవో ఎంఎస్ నంబర్ 68 ప్రకారం 2022 నవంబర్ 30 నుంచి ఈ ఏడాది నవంబర్ 29వ తేదీ వరకూ వర్సిటీ బోర్డ్ మెంబర్‌గా తనను నామినేట్ చేసినట్టు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అవగాహన లేని దుర్యోధన తప్పుడు ప్రచారం చేయడం హాస్యాస్పదం అన్నారు.